# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 ఫిబ్రవరి,10,2015

తెలంగాణలో ప్రతి ఇంటికి నల్లాద్వారా మంచి నీళ్లు అందించే పథకానికి తెలంగాణ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు అనే పేరును ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఖరారు చేశారు. ఈ పనులను అమలు చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పోరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేసింది. డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులను ఇకపై ప్రతి వారం సమీక్షించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పాటు, ప్రజలకు అత్యవసరమైన ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

సచివాలయంలో మంగళవారం డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామీణ అభివృద్ధి-నీటి పారుదల శాఖ అధికారులతో పాటు ఈ ప్రాజెక్టుతో సంబంధం వున్న నీటిపారుదల శాఖ, అటవీ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. మంత్రులు  కెటి.రామారావు, టి.హరీష్ రావు, ప్రభుత్వ సలహాదారు బివి. పాపారావు, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు రేమాండ్ పీటర్, ఎస్.కె. జోషి, గోపాల్, జనార్ధన్ రెడ్డి, మిశ్రా, ఈఎన్సీలు సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, మురళీధర్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి జగదీశ్వర్  తదితరులు పాల్గొన్నారు.

రాబోయే 15 ఏళ్ల కాలానికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేసినప్పటికి, రాబోయే 30 ఏళ్ల వరకు కూడా మంచి నీళ్లను సరఫరా చేసే వ్యవస్థ సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఈ పథకం ఉండాలని

చెప్పారు. ప్రధాన గ్రామంతో పాటు గిరిజన తండాలు, ఆదివాసి గూడాలు, గంగిరెద్దుల గుడిసెలు, ఎరుకల గుడిసెలతో పాటు పది ఇండ్లున్న ఆవాసాలకు సైతం మంచి నీరు అందించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి మంచి నీటి పైపులైను వేసే బాధ్యతను ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులే తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా పైపుల నాణ్యత విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో పైపులు తయారు చేసే కంపెనీల నుండి మాత్రమే పైపులు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం వివిధ కంపెనీలకు సంబంధించిన గత పనితీరును కూడా పరిగణలోకి తీసుకోవాలని సియం చెప్పారు.తెలంగాణలో పైపులు ఉత్పత్తి చేసే కంపెనీలకే పనులు ఇవ్వాలని సూచించారు. పైపులు వేయడం, జాయింట్లు బిగించడం, వాటిని నిర్వహించడం లాంటి పనులను పదేళ్ల పాటు అవే కంపెనీలు చూసుకునే విధంగా బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతి దశలో హైడ్రాలిక్ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఇంటెక్ వెల్స్ నిర్మాణానికి, ప్రాజెక్టులనుండి నీటిని కేటాయించే విషయంలో పూర్తి స్థాయిలో సహకరించాలని నీటి పారుదల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అటవీ శాఖ భూములను అభివృద్ధి పనులకోసం ఉపయోగించుకొనే విషయంలో దేశవ్యాప్తంగా కొత్త విధానం కూడా అమల్లోకి రానున్నదని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో లక్ష ఎకరాలను సేకరించి అటవీ శాఖకు నష్ట పరిహారంగా అందించేందుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అటవీ భూముల్లో పనులకు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ పథకం ద్వారానే పట్టణ ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే పట్టణంలోని వివిధ వాడలకు నీటిని తరలించేందుకు అవసరమయ్యే ఇంటర్నల్ పైపు లైన్ ఆయా మున్సిపాలిటీలు నిర్మించుకోవాలని

ముఖ్యమంత్రి చెప్పారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు పట్టణాల సమీపంలోని గుట్టలను ఉపయోగించుకోవాలని అన్నారు. పట్టణాల్లో కాంటూరు లెవల్స్ కూడా తీసుకొని పైపుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. మే చివరినాటికి ఇంటేక్ వెల్స్ అడుగు భాగం నిర్మాణం పూర్తి కావాలని చెప్పారు. పైపులైన్ నిర్మాణానికి సంబంధించిన రైట్ ఆఫ్ వే నుకూడా ఖరారు చేశారు. దీనికి సంబంధించి ఆర్డినెన్స్ జారీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

పంచాయతీరాజ్ శాఖలో 620 మంది ఇంజనీర్లను టీఎస్ పిఎస్సి ద్వారా నియమించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు.

గోదావరి నుండి హైదరాబాద్ కు మంచినీళ్లు తరలించే క్రమంలో మూడు చోట్ల రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తున్నదని, రైల్వే శాఖ నుండి మరింత సహకారం అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో ముఖ్యమంత్రి వెంటనే దక్షిణ మధ్యరైల్వే జిఎం.శ్రీవాత్సవతో ఫోన్లో మాట్లాడారు. సహకరించాలని కోరారు. దీనికి జిఎం కూడా సానుకూలంగా స్పందించారు.

......................................................................................................

సిపిఆర్ఓ టు సియం

ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 ఫిబ్రవరి,10,2015

మెదక్ జిల్లా కంది ఐఐటి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేకర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

.................................................................................................................

సిపిఆర్ఓ టు సియం